
బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి


సమావేశంలో పాల్గొన్న గులాబీశ్రేణులు

# కాంగ్రెస్ జనగామ సభ అట్టర్‌ఫ్లాప్

- చిన్న ప్రాంగణం.. అన్నీ ఖాళీ కుర్చీలే
- రేవంత్ మాటలకు ప్రజల రెస్పాన్స్ నిల్
- రేపటి చేర్యాల సీఎం సభకు భారీ జనసమీకరణ చేయాలి
- జనగామ జనమంతా కేసీఆర్ వెంటే ఉన్నారు
- బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల సన్నాహక సమావేశంలో జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ) : జనగామలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన విజయభేరి బహిరంగ సభ అట్టర్‌ఫ్లాప్ అయ్యిందని, చిన్న ప్రాంగణంలో అన్నీ ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయని, రేవంత్‌రెడ్డి మాటలకు ప్రజల నుంచి ఎలాంటి రెస్పాన్స్ లేదని బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ శ్రేణులతో ఈనెల 18న చేర్యాలలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రజలు, ముఖ్యంగా మహిళలు నమ్మడంలేదన్నారు. దీనికి నిదర్శనమే కాంగ్రెస్ సభపై ప్రజలు ఆసక్తి చూపకపోవడమన్నారు. రేవంత్‌రెడ్డి సభలో పెద్దగా జనం లేరని, ఆయన మాట్లాడుతుంటే కనీసం స్పందించలేదన్నారు. అంతేకాకుండా రేవంత్‌తో మాట్లాడడానికి ప్రయత్నించిన కొమ్మూరిని ఊకే సతాయించకని స్వయంగా ఆ పార్టీ పీసీసీ అధ్యక్షుడే విసుక్కున్న తీరు ప్రజలు ప్రత్యక్షంగా చూశారని చెప్పారు. రేవంత్ ఆరోపణలకు తాను సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. తను జనగామలో ఉండననే తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పల్లా చెప్పారు. తను జనగామలోనే ఉండి ప్రజలను, బీఆర్ఎస్ పార్టీ నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ జనగామను అభివృద్ధి చేసి చూపిస్తా అని పల్లా మరోసారి స్పష్టం చేశారు. పల్లా ఎప్పుడూ కేసీఆర్ దగ్గరే ఉంటాడని రేవంత్ అనడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ''అవును సీఎం కేసీఆర్‌ను బరాబర్ కలుస్తా.. జనగామ నియోజకవర్గం అభివృద్ధి కోసం నిధులు తీసుకువస్తా'' అని పల్లా అన్నారు. గెలిచిన వెంటనే జనగామలో ఒక ఇల్లు, చేర్యాలలో మరో ఇల్లు తీసుకుంటానన్నారు. జనగామలో ఐదు రోజులు, చేర్యాలలో రెండు రోజులు ఉంటూ ఐదేళ్లు ప్రజలకు సేవ చేస్తా అని చెప్పారు. రోజువారీగా సమస్యలను పరిష్కరిస్తానన్నారు. నియోజకవర్గంలోని ఒక్కో మండలం నుంచి 5వేలు, బచ్చన్నపేట నుంచి 8వేల చొప్పుల జనాన్ని, కార్యకర్తలను తరలించి సీఎం సభను సక్సెస్ చేద్దామని పిలుపునిచ్చారు. ప్రచారంలలో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఇంట్లో ఆసరా పింఛన్ ఉన్నప్పటికీ సౌభాగ్య పింఛన్ వస్తుందని, గ్యాస్ బండ రూ.400కే వస్తదని, సన్న బియ్యం, రైతు బీమా తరహాలో సీఎం కేసీఆర్ భరోసా అందరికీ వస్తుందని చెప్పాలని కార్యకర్తలు, నాయకులకు పల్లా దిశానిర్దేశం చేశారు. ప్రచారం మొదలైనప్పటి నుంచి ఉద్యమ నాయకుల నుంచి అందరూ ఐక్యంగా ముందుకు సాగుతున్నారని చెప్పారు. జనగామ నియోజకవర్గ ప్రజలంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారని.. కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. చేర్యాలకు వస్తున్న పెద్దసారుకు మనమంతా వేలాదిగా తరలివెళ్లి ఘనస్వాగతం పలుకుదామని రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు.

సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు రాకేశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, పట్టణపార్టీ అధ్యక్షుడు సురేశ్‌రెడ్డి, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పోచన్నపేటలో ప్రచారం చేస్తున్న కావ్యశ్రీరెడ్డి

## ప్రతి మహిళ కు 'సౌభాగ్యలక్ష్మి'

### జాగృతి మండల మాజీ అధ్యక్షురాలు కావ్యశ్రీరెడ్డి

బచ్చన్నపేట, నవంబర్ 16 : సీఎం కేసీఆర్ గెలువగానే నెల రోజుల లోపు ఆసరా పింఛన్ల మాదిరిగా ఇంట్లో ఉండే మహిళకు నెలకు రూ.3వేలు సౌభాగ్యలక్ష్మి కింద అందించబోతుందని జాగృతి మాజీ మండల అధ్యక్షురాలు పిన్నింటి కావ్యశ్రీరెడ్డి తెలిపారు. గురువారం బీఆర్ఎస్ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు మద్దికుంట రాధ సూచనల మేరకు గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ కాంసాని మమత, ఎంపీటీసీ మామిడి అరుణాఅయిలయ్య, గ్రామ నాయకులతో కలిసి ఆమె ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడు అయిన పల్లా రాజేశ్వర్‌రెడ్డిని జనగామ ఎమ్మెల్యే అభ్యర్థిగా పంపించడం మన అదృష్టమన్నారు. ఆయన గెలిస్తే ఈ ప్రాంతం సమగ్ర అభివృద్ధి చెందుతుందన్నారు. కారు గుర్తుకు ఓటేసి పల్లాను ఆత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. నాయకులు చింతపండు బాలకృష్ణ, గద్ద శ్రీను, జూల కృష్ణ, దొమ్మాట వెంకటేశ్, నర్సింగరాజు, స్వరూప, నవీన్, క్రాంతి, బాలయ్య, సతీశ్, జగన్‌రెడ్డి పాల్గొన్నారు.

## సాంస్కృతిక సారథి కళాకారుడు సస్పెన్షన్

జనగామ చౌరస్తా, నవంబర్ 16 : తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడిగా జనగామ జిల్లాలో పనిచేస్తున్న బొమ్మెర రవిని శాసన సభ ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన కారణంగా గురువారం జిల్లా ఎన్నికల అధికారి సీహెచ్ శివలింగయ్య సస్పెండ్ చేస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. నర్సంపేటలో ఈ నెల 6న రాజకీయ పార్టీ ప్రచారంలో కళాకారుడు రవి పాల్గొన్నట్లు ఫిర్యాదు అందడంతో ఎన్నికల అధికారి శివలింగయ్య ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద పరిగణించి విధుల నుంచి తొలగించారు.

## హమాలీలకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పిస్తా

- విశ్రాంతి భవనాలు మంజూరు చేయిస్తా
- మార్కెట్‌లో రూ.5కే భోజనం
- బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ) : ''బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్‌ను చూసేది నేనే.. ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే హమాలీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పిస్తా.. స్వీపర్లు, హమాలీలు, ట్రేడర్లకు ప్రత్యేకంగా విశ్రాంతి భవనాలను మంజూరు చేయిస్తా''.. అని బీఆర్ఎస్ పార్టీ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం చైర్మన్ బాల్దె సిద్ధిలింగంతో కలిసి జనగామ వ్యవసాయ మార్కెట్‌ను ఆయన సందర్శించారు. రైతులు, కార్మికులు, వ్యాపారులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నపూర్ణ పథకం కింద మార్కెట్‌లో రూ.5కే భోజన సౌకర్యాన్ని కల్పిస్తానన్నారు. కొవిడ్ కష్టకాలంలోనూ వ్యవసాయ, మార్కెటింగ్, పౌరసరఫరాల శాఖలు బాగా పని చేశాయన్నారు. హమాలీలు, దడువాయి, స్వీపర్లకు కనీస వేతనాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం పరిధిలో ఉన్న వడ్ల ధర పంపు కోసం మనం కొట్లాడుతున్నామని, దేశంలో రైతుకు పెట్టుబడి ఇచ్చే ఏకైక సీఎం కేసీఆర్ మాత్రమే అని అన్నారు. వ్యవసాయ ఖర్చులు పెరిగిందున రైతుబంధు రూ.16వేలు ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయించారన్నారు. జనగామ మార్కెట్‌లో అత్యాధునిక టెక్నాలజీతో కోల్డ్ స్టోరేజీ, గోదాము నిర్మాణం జరుపుకుందామన్నారు. మార్కెట్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను తీసుకొచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. వ్యవసాయం గురించి అడిగితే కాదనని వ్యక్తి కేసీఆర్ మాత్రమే అని అన్నారు. 50ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఇవ్వన్నీ జరిగాయా? పదేళ్లకు ముందు ఎలా ఉందో? ఇప్పుడు ఎలా ఉందో? ఆలోచించుకోవాలని రైతులు, కార్మికులను కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే ఏడాది, రెండేళ్లలో జనగామ అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని స్పష్టం చేశారు.


జనగామ వ్యవసాయ మార్కెట్‌లో హమాలీలతో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు

### పెంబర్తి ఎన్నికల ప్రచారంలో నీలిమారెడ్డి


జనగామ రూరల్, నవంబర్ 16 : గ్రామాల్లో సబ్బండ వర్గాల వారికి ప్రభుత్వం నుంచి అనేక సంక్షేమ పథకాలు అందించామని పల్లా నీలిమారెడ్డి తెలిపారు. జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపు కోరుతూ మండలంలోని పెంబర్తి గ్రామంలో ఆమె పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హస్తకళలకు పుట్టినిల్లు అయిన పెంబర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇతర పార్టీల వారు చెప్పే మాయమాటలు నమ్మితే నట్టేట ముంచుతారని తెలిపారు. పేద ప్రజలకు అండగా ఉండి అనేక పథకాలు అమలు చేసిన కేసీఆర్‌ను ఆశీర్వదించి పల్లాను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అంబాల ఆంజనేయులు, ఎంపీటీసీ ఎం రవి, జడ్పీటీసీ నిమ్మతి దీపిక, మాజీ జడ్పీటీసీ బాల్దె విజయ, మండల మహిళావిభాగం అధ్యక్షురాలు చినబోయిన రేఖారాజు, పార్టీ ఉపాధ్యక్షుడు బండ్రు సత్తయ్య, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కావ్యాకిషన్, రైతుబంధు సమితి కోఆర్డినేటర్ సంపత్, నాయకులు వెంకటేశం, రజాక్, బాలు శ్రవన్, ఎల్లయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


పెంబర్తిలో ప్రచారం చేస్తూ గాజులు కొనుగోలు చేస్తున్న పల్లా నీలిమ

## సబ్బండ వర్గాల సంక్షేమానికి కృషి

### మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు

జనగామ చౌరస్తా, నవంబర్ 16 : రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జనగామ పట్టణ కేంద్రంలో జరిగిన క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కుల–మత తేడాలు లేకుండా సర్వమత సమ్మేళనంతో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా క్రైస్తవ సమాజం తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ టౌన్ ఇన్‌చార్జి భరత్‌కృష్ణ, మైనార్టీ నాయకుడు ఎండీ ఆరిఫ్, ప్రెస్టన్ స్కూల్ కరస్పాండెంట్ బక్క ప్రవీణ్, ఉల్లెంగుల నర్సింగ్, దేవనూరి సతీశ్, పాస్టర్లు దామెర జేమ్స్, మహేశ్, మోజెస్, లాజర్, సంజీవ్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు

## మ్యానిఫెస్టో కటౌట్లతో వినూత్న ప్రచారం

జనగామ రూరల్, నవంబర్ 16 : మండలంలోని పెంబర్తి గ్రామంలో బీఆర్ఎస్ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు చినబోయిన రేఖ ఆధ్వర్యంలో వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను కటౌట్ రూపంలో తయారుచేసి కటౌట్లను చూపిస్తూ ఎన్నికల అనంతరం అమలు చేయబోయే ఒక్కో పథకాన్ని ఓటర్లకు క్లుప్తంగా వివరించారు. కొత్తగా ప్రచారం చేపట్టడంతో ప్రజల్లో ఆసక్తి నెలకొంది.


మ్యానిఫెస్టో కటౌట్లతో ప్రచారం చేస్తున్న రేఖ